# పెంపకం

[ కథానిక ]

శ్రీ కందుకూరి లింగరాజు

"ఏదైనా ఉద్యోగం చేస్తానండి"—పేపర్లో తన నెంబరు మిగిలిపోయిన పార్టులో ఉండడం చూచి, నిట్టూర్పు భారంగా ఒదులుతూనే, రాజా అన్నాడు.

అంతవరకూ అయిదుసార్లు వెళ్లేడు. వెళ్లినా, విశ్వవిద్యాలయం కృతకృత్యుడవడానికి అనుజ్ఞ ఇచ్చేరే కారు. ఈ రెండు సంవత్సరాల్లోనూ రాజాని కనీసం నెలకి పదిమందైనా అడిగేరు. ఆప్రశ్నలు చిరాకు కల్గించేవి. న్యూనతపరచినట్టే వుండేవి. పైగా తోడి వారలు నల్లగౌను తొడుక్కోవడం తలతీసినట్టే వుంది.

రామయ్యపంతులు చదువుతున్న పేపరు ఓసారి దించి, కొడుకువైపు చూచేడు ఆశ్చర్యంతో. "ఉద్యోగం...ఇంటర్మీడియట్ కే ఎవడిస్తాడు ?."

"ఎక్కడో అక్కడ...సర్వీస్ కమిషన్ కు కడతా". ఈమాటలు రామయ్యకి న్యూనత కల్గించేయి.

అసలు తను ప్రవేశించడమే ఉద్యోగిహోదాలో ప్రవేశించి, ప్రభుత్వానికి చీము రక్తం ధారపోసి, మేడమెట్లు ఎక్కేడు. ఆఖరుకు మేడమీద కూర్చునే ఉద్యోగంకూడా అయింది. తనకొడుకు ఇంత నీచంగా, నలభైరూపాయిల ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేని విషయంలా ఉంది.

తన ఆశల్లో కనీసం బి. ఏ. అయినా అయి, ఉద్యోగిఘాయిదాలోనే చేరాలన్న ఊహ వెనక నిలుచుంది. అంతవరకూ కొడుకుని గారాబంగానే పెంచేడు. వాడు పుట్టినప్పటినుంచి ఖర్చు ఎక్కువే అయినా భరించేడు. భరించడంలోకూడా నొప్పి కల్గినా ఓర్చుకునే.

తండ్రి ఆలోచనలో పడ్డం రాజాకు ఆలోచన కలిగించింది. తనకు నిజంగా లోపల చదవాలని వున్నా, తను ఆ కాలేజీల్లో ప్రవేశిస్తే చదవలేనని తెలుసు. చదివినా పట్టా రావడానికి, క్రిందటి అనుభవం 'కొన్ని సంవత్సరాలు పట్టావచ్చు'అనే చెపుతోంది.

"పోనీ, డాక్టరీ చదవమన్నారా ?"

"ఛీ ! చావులు, బ్రతుకుల మధ్య జీవనం. మన వంశంలో ఎవరూ చదవనేలేదు."

"ఇంజనీరింగు...?"

"నీది లెఖ్ఖలుగ్రూపు కాదేమో !"

పాలుపోయింది కాదు రామయ్యపంతులకు. తన వ్యూహాల్లో బి. ఏ. అయినతర్వాత, కనీసం తన బావగారు—ఆయన వో రిటైర్డుకలెక్టరు—తన పైఅధికారి సహాయం చెయ్యకుండా ఉంటారా అన్న ధైర్యం.

"మరి ఏం చెయ్యమన్నారు ? ఉద్యోగమా అక్కరలేదు. డాక్టరీ మంచిది కాదు. ఇంజనీరింగుకు ప్రవేశం లేదు. మరి ?"

కొడుకుప్రశ్న నిలబెట్టినట్టే అయింది. కోపం తెప్పించింది. అంతవరకూ తను ఆఫీసులో గుమాస్తాలను, బంట్రోతులను నిలవనియ్యకుండానే ఆజ్ఞాపించేవాడు. ఇక్కడ పాలుపోకుండానే సందిగ్ధంలో పడిపోయేడు.

తను సంపాదించి, తిండీ బట్టా ఇస్తుంటే, పడి తింటూకూడా, తన్ని విమర్శించడానికి ఎందుకు కాలు దువ్వుతారో తెలియటం లేదు.

"మద్రాసులో బావకు వ్రాస్తా...సైన్సు బి. ఏ. లకు మంచి భావి వుందేమో"అంటూ ఖండువా భుజంమీద వేసుకుని వెళ్లేడు.

ఆచెప్పడం ఇరుకున బెట్టినట్టు ఉన్నా, ఏం చెయ్యాలో తెలియని స్థితిలో పడిపోయేడు. తలలో అనేకఆలోచనలు ఒచ్చేయి. అంతవరకూ తండ్రి అడిగి నంతా డబ్బు పంపించడంతో ఏర్పడిన దూబరాఖర్చు నరాల్ని పీకేది. డబ్బు లేక, ఈ మార్చి సెప్టెంబరుల్లో ఉండడం, తనను ఎంత బాధపెట్టిందో ఓర్చుకోలేని స్థితికి తెచ్చిపెట్టింది. ఈలేమే ఉద్యోగానికి ప్రోత్స హించిందికూడాను.

ఆ నెలల్లో తండ్రిని అడుగుదా మనుకున్నాడు. వచ్చిన ఇరవై దరిదాపువయస్సు మనస్సును నులిమింది. 'మెజారిటీ' 'ఇంకా అడగడం ఏమిటీ?' అని చెప్పింది. అమ్మని అడిగేడు. "మీనాన్న నాకు డబ్బుకూడా ఇస్తాడా ఏమిటి? అంతగా నమ్మకం లేకపోతే తాళంచెవి ఇస్తా, నాపెట్టి చూచుకో" అనేది.

ఈ పరిణామం, మళ్లీ చదువంటే వెనక్కు తీసింది. అయినా...

మద్రాసునుంచి ఉత్తరం రావడం, ఎస్టేట్ కలెక్టర్ గారికి ఓఉత్తరంతో, రాజా నగరంలో చేరి పోయేడు. బి. ఏ. లోనే, సైన్సుగ్రూప్‌లోనే.

*　　*

రామయ్యపంతులు ఆ రెండు వత్సరాల్లోనూ కనీసం మూడువేలైనా ఖర్చుపెట్టేడు. అడిగినప్పుడల్లా పంపనే పంపేడు. పెద్దపరీక్షలు అయి ఇంటికి వస్తా డనేటప్పటికి, ఏదో బరువు తీసినట్టే అయింది. తన బావకు, ఇన్‌స్పెక్షనుకు వచ్చిన పైఅధికారికి ఓసారి తన కొడుకుసంగతి జ్ఞాపకంచేసేడు. వాళ్లు అన్న మాట లతో ధైర్యపడిపోయేడు.

వీళ్లిద్దరూ, కనీసం ఓవందరూపాయిలకు తక్కువకాని ఉద్యోగం ప్రభుత్వందగ్గర వుళ్లాకు కైనా ఇస్తా రనే ధీమాతోనే అంతస్తులు కట్టేడు. ఉద్యోగం ఎల్లాగా అవుతుంది; పెళ్లికూడా చేసేస్తే ఓవిధంగా బాధ్యత తీరిపోతుం దని వూహించేడు. అప్పుడే నలుగురైదుగురు రావడం, వాళ్లు మూడు, నాలుగు, ఐదువేలుకూడా ఇస్తా ననడం గర్వంగా వుండే విషయమే అయింది.

పెళ్లివిషయంలో తన అక్కగారితో చర్చిం చేడు కూడాను. ఒక్క ఈ విషయమే ఏమిటి, ప్రతీ విషయమూనూ. ఆఖరుకు పెళ్ళానికి చీరెలు కొనాలా, అక్కర్లేదా అన్న చిన్నసంగతికూడాను. ఇల్లా ప్రతీదీ అడగడానికి కారణం లేకపోలేదు. రామయ్య పంతు లుకు చిన్నతనంలోనే తల్లీ, తండ్రీకూడా పోయేరు. అప్పటినుండి ఆవిడే గురువైపోయింది. ఆతని చదువు, ఉద్యోగం, అన్నీకూడా ఆమె పురమాయించినవే. ఇంట్లో పెత్తనంకూడా ఆమెదే.

ఒక్క మాటలో చెప్పాలంటే, సన్నంగా, వూచలా ఐదడుగులలోపు వుండే ఆవిడమాట వినాలి. వినితీరాలి. ఇతరులుకూడా దాన్ని దాటి వెళ్లకూడదు అన్న భావం మిద్దెకట్టుకు కూర్చునేది. ఆవిడా ఉన్న తెలివితేటల్తో,రామయ్యని కొంగున ముడేసుకునే చెలా యించింది.

ఒక్కొక్కప్పుడు రామయ్యకు ఆవిడ చెప్పే పనుల్లో కష్టం తోచినా, ఎదుగు తిరగడానికి దమ్ములు చాలేవికావు. ఎదురుగా పెంచిన, పైకితెచ్చిన కృత జ్ఞత ఉట్టికట్టుకోవడంవల్ల తన వ్యక్తిత్వమే చంపుకుని, ప్రభుత్వాన్ని ఆవిడకు అప్పజెప్పేసేడు. ఈ స్థితికూడా ఉంచవలసిన కొలమానం దాటి, ఆమె ప్రతీ విషయం లోనూ జోక్యం కల్పించుకొని, ఆఖరుకు ఆఫీసు, ఇంటి, స్వ, పరకీయాల్లో సలహాలు చెప్పడంతో, రామయ్య పంతులు అసలు ఇంక తను ఆలోచించడం ఎందుకు అన్న స్థితిలో పడిపోయాడు. ఇది ఒక్కొక్కసారి తిరగబడ్డా, సందిగ్ధం ఎక్కువై ఏమీ చెయ్యలేని, స్త్రీ పెంపకపు బిడ్డలాగే తయారైకూర్చున్నాడు. దీంతో ఈలేనితనం నోరుకట్టుకుని లోపల కూర్చుంది.

ఆరోజుల్లో రోజూ పేపరు చూస్తూనే ఉండే వాడు రామయ్యపంతులు ఫలితాలు వచ్చేయేమో అని. ఉండబట్టలేకనే ఆరోజు అడిగేడు.

"ఏదో వ్రాసేను"

కోపం వచ్చింది. తను సంచీకి చిల్లుపెట్టి మూడు వేలుపైగా ఖర్చుపెట్టేడు. కాలేజీలో ఉన్నప్పుడే వాళ్లవల్లా వీళ్లవల్లా వింటూనేవున్నాడు—'మీ వాడు కాలేజీనాటకాల్లోనూ, విద్యార్థులయూనియన్‌లోనూ పాల్గొంటున్నా'డని; పైగా చిల్లరగా వెధవకథలు పత్రికలకు వ్రాస్తున్నాడని కూడా విన్నాడు. ఇప్పుడు ఉద్వేగం ఆగకే—

"చదువు మానేసి, కథలూ, నాటకాలలో పాల్గొంటూ కూర్చున్నా వన్నమాట".

ఉలిక్కి పడ్డాడు రాజా. నిజంగా ఆతని జీవితం అక్కడ అల్లాగే జరిగిపోయింది. అయినా తన కాలేజీ తన్ని మరిచిపోకుండా చేసుకున్నాడు. ఇదంతా ఎల్లా తన తండ్రికి తెలిసిందో అర్థం కాలేదు.

"పేపర్లు..."

"నీముఖం...నువ్వు చదవక పేపర్లు కష్టంగా వున్నాయంటే అర్థం ఏమిటి? ఇక్కడ నే నెంత చచ్చి డబ్బు పంపించేనో అర్థం కాదు. ఎప్పుడూ డబ్బు, డబ్బు! ఉత్తరం రావడంతడవు; డబ్బు, డబ్బు...కాని చదువో..."తడబడ్డాడు.

"మీ రిల్లా అంటారనే, ఉద్యోగం చేస్తానన్నా."

ఏం సమాధానం చెప్పాలో మొట్టమొదట అర్థంకాకపోయినా, కోపం ఒణికిస్తుంటేనే—

"మహా చేసేవ్...ఇది ఇల్లా వెలగబెట్టేవ్, అది ఇంక తగలెడతావ్" అన్నాడు.

గబగబా, అన్నంముద్ద తినకుండానే వెళ్లిపోయాడు రాజా. ఒక్కటీ అర్థంకావటం లేదు. తన తండ్రి తనను ఇల్లా ఎందుకు ప్రతీపనిలోను దిగనారుస్తాడని ఆలోచించేడు. తనకు జ్ఞానంవచ్చినప్పటినుండి, కనీసం ఒక్క విషయంలో 'మంచిది. అది చెయ్యి' అని చెప్పిన విషయం కన్పించలేదు.

చాలాసార్లు ఎదిరిద్దామన్న వూహ కల్గింది. ఎదిరించి, తను తనపంథాని, మార్గాన్ని వాళ్లమీద రుద్దలేకుండానే వున్నాడు. ఎంత చెప్పినా తన దృక్పథం వాళ్లదృష్టిలో తప్పు. ఏంచెయ్యాలో పాలుపోకనే బాధపడేవాడు.

ఆవారంలో పరీక్షరిజల్ట్సు వచ్చేయి. ఒక్క తెలుగులోనే ప్యాసయివుండడం రామయ్యకి అరికాళ్ల మంటలు పెట్టినట్టే అయింది. నాలుగూ దులిపేసేడు. పోయిన డబ్బుకు, ఎదురుసమాధానం చెప్పే కొడుక్కి, గుండెలు మండుకుపోయేయి.

తనకు ఎదురుసమాధానం చెప్పేవాణ్ణి ఏం చెయ్యాలో పాలుపోలేదు. తన జీవితంలో తన అక్కగారికి ఎప్పుడూ ఎదురుచెప్పనేలేదు. మరి తన కొడుకు తప్పుచేసికూడా, కట్టెవిరిచినట్లు ఎందుకు మాట్లాడుతాడు? తల్లిపోలిక వాడికి వచ్చిందేమో అనుకున్నాడు. కాని తనకు, అక్కగారికికూడా, కుక్కినపేనల్లే చాకిరీచేసే, మాటలు వచ్చా అన్న అనుమానం కలగజేసేట్టే వుండే. మరి...

తన ఆఫీసులో గుమాస్తాగా వేయిద్దామనుకున్నాడు; సెప్టెంబరు నెలవరకూ. అయినా అది తాహతుకు తగ్గట్టుగా కన్పించలేదు.

ఆ రోజుల్లో రాజాస్నేహితుడు గణపతి రావడం ఆశ్చర్యపరచింది రామయ్యపంతుల్ని—ఎందుకు వచ్చేడా అని. ఉండిఉండి "నేను మిలిటరీ క. సి. ఓ. సెలక్షనుకు పెట్టేను. మీ అబ్బాయినికూడా దరఖాస్తు చెయ్యమనండి"అన్నాడు.

ఉలిక్కిపడ్డట్టే అయింది. తను ఎదటబడి చెప్పలేని విషయాన్ని స్నేహితుడితో చెప్పించడానికి రమ్మన్నాడన్నమాట. యుద్ధం! పేరు వింటేనే తనకు భయంగా వుంది. అయినా బ్రాహ్మణుడికి, కులగోత్రాలు లేని తిండి, దేశంకాని దేశంలో, పీనుగుల్లా ఉండి చావడానికే. కాదు...మనస్సు ఒప్పుకోలేదు. పైగా చేతికి అందివచ్చినవాడు. ఇంతకాలం, తిట్టినా, తను ఒదులుకోలేని వయస్సు.

"నా కిష్టం లేదోయ్".

"పెళ్లీ పెటాకులు లేవు కా! నాకు వెళ్లాలని వుంది; వెళతా" అన్నాడు రాజా. "మనకులం వాళ్లకు ఇప్పుడు దారీ తెన్నూ అది ఒక్కటే అనాలి. లేకపోతే మనకు ఎవడు ఉద్యోగం ఇస్తాడండి?"—స్నేహితుడు, తను చెప్పేది హేతువాదకంగా ఉన్నట్టే.

"ఉద్యోగం అదే వస్తుంది. అయినా ఇప్పటి వాళ్లకు యుద్ధంలోకి పోతాం అన్నది ఓ పరిపాటైంది."

"చచ్చేవాళ్లు ఎక్కడైనా చస్తారు. తిరిగివస్తే, ఏ గెజిటెడ్ రేంకులోనో ఉండవచ్చు" అన్నాడు తన తండ్రి తనకు అనుమతి ఇవ్వటం లేదన్న ఉక్రోషంలోనే. పరీక్ష పోయింది. తను చదవలేదు. చదవాలన్నా, ఇంట్లో కనుపించే పరిస్థితులు తనను చదవనియ్యవు. తను అలవాటుపడ్డ పరిస్థితులు తన్ను ఒదలవు. తండ్రి తనకి డబ్బు ఇవ్వడు...ఎన్నో...ఇవన్నీ కలిసే ఆ ఉద్రేకం పోసేయి.

"ఏభైయోపడిలో పడ్డవాళ్లం. మాకు ఇప్పుడు సహాయం అన్నది కావాలి. కొడుకులు చేస్తారు అని మేం ఆశిస్తాం..."

దిగ్బంధనమే అయింది. కృతజ్ఞత! ఎంత బరువుగా వుంది. తన్ను కని, పెంచినందుకు, తను భావి, ఉన్నతి, ఇచ్ఛకూడా క్రతువుక్రింద పెట్టి, వాళ్లకోసం వుండాలి...గుండెలు నులిమినట్టే అయ్యింది.

రైలులో గణపతిని ఎక్కిస్తూనే, "నువ్వు వెళ్లిరా! నాకు అదృష్టం లేదోయ్" కన్నీళ్ళు తిరిగేయి. వెను తిరక్కుండానే స్టేషనులోనుండి బయట పడ్డాడు. దారి పొడుగునా ఆలోచనలు వచ్చేయి. అవి కోపంగా నుంచుని తండ్రిని తిట్టేయి. తన అసమర్థతకి ఏడ్చేయి.

కృతజ్ఞత! నాలుగుదిక్కులమీద కూర్చుని అరిచే దాన్ని, తన చీము, రక్తం పీల్చడానికి వచ్చిందే అనుకుని ఏడ్చి, ఇల్లు చేరేడు.

* * *

రెండు వత్సరాలు తిరిగేయి. ఇవి రెండుకూడా రాజాని, శాంతినిచ్చి, ప్రపంచకంలోకి పంపలేకపోయేయి. ఆ నాల్గు పరీక్షలకు వెళ్లేడు. ఈసారైనా తప్పకుండా ప్యాసయితీరాలన్న ఆశతోనే చదివేడు. వెళ్లేడు. పేపర్లు అతని నెంబరును మాత్రం అచ్చువేసుకోనేలేదు.

ఈ తీరుబడిగావుండే కాలంలో ఏం చెయ్యాలో తెలిసేది కాదు. ఎప్పుడైనా కథలు వ్రాయాలన్న కోర్క కలిగితే వ్రాసేవాడు. అవి పంపించేవాడు. ఒక్కొక్కసారి ఈ వ్రాయడంకూడా ఎందుకూ అన్న జిజ్ఞాస కల్గేది.

ఇదికాక, తన దినచర్యలోకూడా ఓక్రమబద్ధం ఏర్పడించి. లేవడం, కాఫీత్రాగడం, ఇంట్లో ఏం సరుకులు కావాలో అడిగి బజారుకు పోవడం—ఇది నూత్నంగా అలవాటుపడింది. ఓవిధంగా కొంతకాలం గడచిందని అనుకుందామనుకున్నా, రోజూ తన తండ్రి ఎకౌంటుపుస్తకం తణిఖీచేస్తూనేవున్నాడు. ఇది బాధ కలిగించింది. తనమీద నమ్మకం లేదనే ఇల్లా చేస్తున్నాడన్న భావన క్రమ్ముకొనేది. ప్రతీదీ ఆరాతీసి అడిగేవాడు.

ఆ నెలల్లో తన చేతిలో కనీసం కాఫీత్రాగడానికైనా డబ్బులు ఉండేవి కావు. చదువుతున్నపుడో, రెండు చేతులా విరజిమ్మేడు. ఆ వాసన ఒదలటం లేదు. డబ్బు తనలో అలవాటుకోసం కావాలి. ఈ కావాలి అన్న భావన, పిపాసా, తను ఇంటిఖర్చు చేసినప్పుడల్లా పావలాది ఆరణాలు, అర్ధణాది అణా వేసేట్లు చేసింది. అల్లా తనచే దొంగపద్దు వ్రాయించేది. ఈ దొంగతనం ఆరాలుతీయించడం సహించలేక పోయేది. అడిగినపుడల్లా రాజా దెబ్బలాడేవాడు.

"అంత నమ్మకం లేకపోతే, ఏ బంట్రోతుకో ఇచ్చి తెప్పించుకోలేకపోయేరా?"

"అంత పౌరుషం ఎందుకూ? అడిగినంత మాత్రములో చెప్పడానికేం? వాళ్లుమాత్రం సరి అయినవాళ్లా ఏం?"

"మీ ఉద్దేశ్యంలో నేను అటువంటివాడినేకా?"

రామయ్యకు ఆ ముక్కలు చిరాకు తెప్పించేవి. తిని, ఇంటిదగ్గర వెధవముండలా పడివుండక, పైగా పరీక్షలకు డబ్బు తగలేస్తూ తిరిగేవాడికి ఇంత ఉక్రోషం ఎందుకా అన్నది సమస్యక్రిందనే ఉండేది. తను తన కొడుకును ఓడబ్బున్న ఫాయిదాలో పెంచేడు. కావలసినంతా అప్పుడు ఇచ్చేడు. ఇప్పుడు ఈ స్థితిలో వాడికీ ఆ పూర్వపు అలవాట్లు ఉంటాయనీ, వాటికి ఖర్చుక్రింద డబ్బు ఇవ్వాలనీ తోచలేదు. అసలు ఆ భావన కల్గడంకూడా ఏ కోశాన్నైనా లేనేలేదు.

"అయితే నువ్వూ వాళ్లల్లోనే జమ అన్నమాట" తన తెలివితేటలకు తానే మురిసిపోతూ.

రాజా వెంటనే లేచివచ్చి, అక్కౌంటు పుస్తకం, మిగిలినచిల్లరా పెట్టెమీద పెట్టి "నే వాడదలచుకోలేదు"అని చివాలున వెళ్లిపోయేడు.

"వెధవపౌరుషా లున్నాయి! అన్నిపనులూ నేనే చేస్తూవుండాలి. ఎదిగినవాడు ఉన్నాడు అంటే ఆమాత్రం సాయం చెయ్యక్కర్లేదూ...?"

విషం మ్రింగినట్లే భరించేడు. ఏం చెయ్యగలడు? డబ్బు సంపాదిస్తేనే మనిషి. లేకపోతే ఎందుకూ పనికిరాని చెత్తకారి. బ్రతికినా చచ్చినవాడితో సమానం...

ఆ ఉద్రేకంలోనే ఏదో ప్రకటన చూచి ఉద్యోగానికి దరఖాస్తు పెట్టేడు. దరఖాస్తులో తను ఖచ్చితంగా బి. ఏ. వరకే చదివేననే వ్రాసుకున్నాడు. వయస్సు పూర్ణవయస్సే వేసేడు. ఇరవైనాలుగు.

ఆ అంకెలు వేసేటప్పుడు దుఃఖం వచ్చింది. ఇరవైనాలుగువత్సరాలు, దరిదాపు అర్ధజీవితం వెళ్లిపోయింది, చెప్పుకోదగ్గది ఏమీ తను చెయ్యకుండానే. కష్టపడి తను సంపాదించిందని ఒక్క యాగానీ చూసుకోకుండానే. భావిమాత్రం నిర్దయగా ఎదురు చూస్తూనేవుంది.

ఇన్నివత్సరాలూ తండ్రి గడించిన డబ్బే తిన్నాడు. ఆయన్ని పీల్చి పిండిచేసేడు. చేసినా సక్రమం కాలేకనే, తన జీవితం వక్రమం అయిపోయింది. ఈ ఇన్నేళ్లు తన ఇంట్లోనే తాను ఓ గౌరవనీయబానిస అయి వుండిపోయేడు.

ఆఖరున సంతకం పెట్టినపుడు రెండు-చినుకులు చొక్కాలో ఇనికేయి. తను పుట్టడం ఇందుకే అనుకున్నాడు. పుట్టినా ఏ కఠినత్వమో రాకుండా, సూక్ష్మగ్రాహ్యత, సున్నితం ఎందుకు అలవాటైందో తెలియనేలేదు. ఇవే తనకు పరీక్షలు పోగొట్టేందుకు ఉచ్చులుకూడా పన్నికూర్చున్నాయి...

ఓ వారంరోజులు పోయినతర్వాతనే ఇంటర్వ్యూకు రమ్మని వచ్చింది. కాగితం తండ్రిచేతుల్లో పెట్టి గుమ్మానికి వేళ్లాడేసిన మామిడాకుల్ని లెఖ్ఖపెట్టేడు.

"జీతం ఎంతేమిటి?"

"ఏభై."

"ఏభై! ఈకాలంలో మా ఆఫీసుజవాను సంపాదిస్తున్నాడు. ఏం ఉద్యోగం అది? మార్చికి కట్టేవు కా..."

నరాలు తోడేసినట్టయింది. ఏం చేస్తాడు? నిజంగా చెయ్యలేని స్థితిలోనే పడిపోయేడు. అందులోనే జీవిస్తుంటకూడాను.

"మరిచిపోయేను. ఓసారి పట్నం వెళ్లిరావాలి. వాళ్ల అబ్బాయి ఒకడు ఉన్నాట్ట. వారిని మన అమ్మాయిని చూసుకుందుకు రమ్మని చెప్పాలి."

అక్కగారు గుమ్మంలో నుంచునే "సిద్ధాంతి, రేపు బావుందన్నారు ప్రయాణానికి..." అంది.

మామిడాకుల లెఖ్ఖ తేలనేలేదు. ఇదివరకు రెండు మూడుసార్లు పెళ్లికొడుకుల్ని పిలుచుకువచ్చేడు. వాళ్లు రానుపోను ప్రయాణంఖర్చులు పుచ్చుకుని, నాల్గు పిండివంటలతోనూ పీకలదాకా తిని, ఉత్తరమైనా వ్రాయక కూర్చున్నారు...

దారిలో వెళుతూనే తన ఉద్యోగంకూడా చెప్పకుండానే మాచి; పట్నం వెళ్లేడు. వాళ్లు నానా ప్రశ్నలు వేసేరు. అందులో 'నీకు పెళ్లి అయిందా? ఏం ఉద్యోగం? ఎంత జీతం? పిల్లలా?' ఈ వరసలో ఉండడం చిరాకుపరచింది. కాని అనునయంగా తప్పించుకున్నా, ఆ ప్రశ్నలు రైల్లో పడి తన ఇంటికి వచ్చేవరకు పీడిస్తూనే వున్నాయి.

"ఏం ఉద్యోగం? జీతం ఎంత?" ఎన్నోసార్లు సూదుల్లా పొడిచేయి. ప్రతిరక్తనాళాన్నీ అంకుశంలాగే గ్రుచ్చేయి. ఇరవైఅయిదేళ్లు వచ్చి, వాట్లకి గొప్పగా సమాధానం చెప్పలేకనే చచ్చిఉండిపోయేడు. "తండ్రి మీద పడి......" ఇంకా ఎందుకూ జీవించడం అనితట్టింది.

అదృష్టం అనేది లేదేమో! అది వున్నా కనీసం తను వారం వారం చూచే వారఫలితాల తపస్సుకైనా ఒడిలో ఒరుగుతుందేమో అన్న ఆశతోనే అన్ని వారాలూ చూచేడు. "మంచిరోజులు. ఉద్యోగప్రయత్నం ఫలించే సూచనలు ఉన్నై. అభివృద్ధి, మార్పు..." ఇల్లాంటి తారీఖులు నిద్రపోకుండా కలలుగని, రాత్రిళ్లు ఏడ్చేవాడు...మానవుల్లో పెంపునలలో స్వం చచ్చిపోతే ఇల్లాంటి ఆశలు, తాత్కాలికఉపశమనాలకు అర్రులు చాస్తుందేమో!...

పెళ్లివారు వచ్చేరు. ఆ హడావిడిలో తీరుబడిలేనట్టే ఉండేది. ప్రయాణాల్లో మిగిలిన డబ్బులు రోజురోజుకు తరిగేయి. అవి అయిపోతాయేమో అనే భయపడ్డాడు. జీవితంలో నరకం.

అనుకోకుండానే పదిరోజుల్లో, ఆ ఏభైరూపాయల ఉద్యోగంలో ప్రవేశించమని కాగితం వచ్చింది. సంతోషం పట్టపగ్గాలు లేకుండానే క్రమ్మింది. జీవితం మారింది. అదృష్టం అంటే ఇదేనా? ఈ నాడుతో డబ్బున్న ధనికుని ఇంట్లో పుట్టిపెరగడం కంటె నరకం లేదనుకునే ముక్తికి సంబరపడుతూనే తండ్రి దగ్గరకు వెళ్లి చెప్పేడు.

ఆయన ఆ కాగితం చదివేలోపునే, తన తండ్రి వెళ్లమంటాడు, ఖర్చుకు డబ్బుఇస్తాడు, క్యారియర్, క్యాంపుకాట్ కూడా పట్టుకువెడితే మంచిది...అనుకుని ఊహలు పన్నుకున్నాడు.

"వాళ్లు పెళ్లికి ఒప్పుకున్నట్టు వ్రాసేరు. నువ్వు ఓసారి మన రైతులదగ్గరకు వెళ్లి వసూళ్లు చేసుకురావాలి."

"ఉత్తరాలు వ్రాస్తే వాళ్లే పంపిస్తారు..."

"పెళ్లి అయినతర్వాత వెళ్లవచ్చు. ఇదివరకు ఉత్తరాలు వ్రాయకనే పంపించలేదా? ఇవన్నీ ఎవరు చూస్తారు?..."

"అప్పుడు శెలవుపెట్టి ఒస్తా కావలిస్తే: ఇప్పుడు నాకు జాయిన్ అవ్వాలని ఉంది."

"ఉందీ!" ఎర్రపడి చూచేడు.—"ఇంతోటి జీతపు ఉద్యోగంలోనూ...రెండు స్కూల్ ఫైనల్

కుర్రాళ్లకు ప్రయివేటు చెప్పుకుంటే వస్తుంది. ఇంత దూరం వెళ్లక్కరలేదు..."

"వెళ్లక్కరలేదు—" ఆ నొక్కి అనడంలో వచ్చిన శబ్దం నరాల్ని తోడేసింది. తనను చిత్రవధచేసి, ప్రతీఖండంలోని రక్తం తండ్రి త్రాగుతున్నట్టే కన్పించింది. నిజంగా తండ్రికాడు......అనుకున్నాడు.

కాళ్లీడ్చుకుంటూనే గదిలోకి వెళ్లి, ప్రక్కమీద పడి ఏడ్చేడు. కోపం, దుఃఖం రెండూ ఆవేదన పట్ట పగ్గాలు లేకుండా ఆక్రమించేయి.

తిండి, ఈ నరకపుటిల్లు ఆక్షణంలో విడిచి పారిపోవాలి అన్న ఆలోచనా డబ్బులు లెఖ్ఖపెట్టేటట్టు చేసింది. మూడురూపాయిల పావలా అర్ధణా. ఆ ఫు·రు వెళ్లి ఒక్కపూటకి తిండికి సరిపోతుంది...తర్వాత... ఎవర్ని అడుగుతాడు? ఎల్లా...

దుఃఖం ఎక్కువైంది. తన అనామకజీవితం ఎందుకు ఇంకా ఆనిస్తూ నిలబడిందో తెలియటంలేదు. విరక్తి కల్గింది. అయినా తను తెగించగల్గేంత ధైర్యం రావటం లేదు. చాలాసార్లు అనుకున్నాడు. చస్తే నయన అని...కాని చావడం...భయం...

ఒక్కటి. కృతజ్ఞత నురగలుకక్కుకుంది. "నిన్ను కళ్లల్లో, గారాబంగా పెట్టిపెంచేరు. వాళ్లకు..."

భరించుకోలేని దుఃఖం, ఆవేదనతోనే శాంతి పడా ఏడ్చేడు. జీవితంలో మనసారా ఒక్కసారి ఏడిస్తే, సుఖం అందుబాటులో వుంటుందేమో అనుకునే.

*　　　　*　　　　*

ఆ రోజుల్లో తన కొడుకు తను నిర్దేశించిన, నిర్ణయించిన పనులన్నీ వింటున్నాడు అనేది గర్వం కల్గించింది. ఇంట్లో తన ప్రసక్తి అక్కరలేకుండానే సంసారం గడిచిపోతోంది. సంవత్సరం సంవత్సరం రైతులవద్దకు వెళ్లడం, శిస్తువసూళ్లు, కొత్తకదపాలు వ్రాయించడం రాజాయే చేసేడు. రామయ్యపంతులుకు తను వెళ్లి వసూలుచేసినదానికంటె ఒక్కపైసా బాకీ లేకుండా, సింగరాజు లింగరాజులా రాజా తెస్తున్నందుకుమాత్రం చాలా సంతోషం అయింది.

రెండు మూడుసార్లు పెళ్లివారింటికి వెళ్లేడు. తన పేరుమీదనే తాంబూలాలు కూడా ఇచ్చేడు. ముహూర్తం పెట్టించాలనే తాపత్రయపడ్డాడు. అన్నీ తనే. తన కొడుకు ఈ మారిన పద్ధతుల్లో సంతోషం తెచ్చిపెట్టినా, పెళ్లి అయిన క్షణంనుండి, ఎక్కడికైనా వెళ్లిపోతాడేమో; అందుకే ఈ శ్రమ, ఆందోళన పడుతున్నాడన్న ఆలోచన రాకపోలేదు. వచ్చినా, తను ఆలోచించలేని నిస్సత్తువ, దాన్ని పొడిగించనివ్వలేదు.

ఆరోజులన్నీ ఆలోచనలు పెళ్లిగురించే జరిగేయి. చర్చలు, నిర్ణయాలుకూడా అయ్యేయి. అనుకోకుండా అక్కగారు, రెండురోజులు మంచం ఎక్కి, మూడోరోజున స్వర్గస్థురాలైంది. ఇది రామయ్యను తల్లి విడిచిన పక్షిలా చేసేసింది.

ఆ రోజునా, దాంతర్వాత పదిరోజుల్లోనూ తన తండ్రి వలవలా ఏడ్వడం, ఆగదిలోకి వెళ్ళి, ఘంటల తరబడి దుఃఖిస్తూ, ఆవిడ జీవితచర్యల్ని మననం చేసుకుని మరింత క్రుంగిపోవడం రాజాను ఊపేసింది. ఆవిడ ఆ సమయంలో చచ్చిపోయినందుకు నిజంగా తనూ బాధపడ్డాడు. ఏదో సంసారానికి పెద్ద ఆసరా తీసేసినట్టే అయింది; ఇంటికి నడిమూలం తీసినట్టుగా. ఇల్లు శూన్యంగా, ఎడారిలాగే ఉన్నట్టు తట్టింది.

ఆవిడ, అవిచ్ఛిన్నంగా ఏభై సంవత్సరాలు ఆ యింటిని కిరీటం లేని రాజులా ఏలి, వన్నెలు కల్పించింది. తన తండ్రికి, ఎవరూ చెయ్యలేని త్యాగం, 'స్వం' చూచుకోకుండానే ఒనర్చింది. అల్లాంటి మూలవిరాట్టు పోవడం అందరికీకూడా, పైగా తనకి, ఓ పెద్ద అఖాతం కల్పించింది.

దుఃఖించేడు. మనసారానే ఆవిడనుగురించి ఏడ్చేడు. కాని తనతండ్రిని చూచినపుడల్లా బేజారు అయ్యేట్టే మనస్సు గుబగుబమనిపోయింది. నిజంగా దిక్కులేనివాడే అయ్యేడు. ఆయన తల్లితండ్రులకి పుట్టిన సంతానంలో ఆయన ఒక్కడే మిగిలి, చచ్చిన అప్పగారి గుణగణాలకు దేవత్వం ఆపాదించుకుంటూ కాలం గడపాలి. ఎంత భీకరంగా, నిర్దయగా కాలం నుంచుంది?

నెలరోజులు శెలవు పెట్టి, దుఃఖం, బెంగవల్ల కృశించిపోయిన తండ్రిస్థితి హృదయాన్ని కలచివైచింది. నానాటికీ బెంగతో కృశించిపోతున్న తండ్రిని చూస్తే జాలి, దుఃఖం కూడా బాధించింది.

ఆవిడ వెళ్లిపోయింది. ఆవిడబాధ్యత ఇప్పుడు ఎదిగి ప్రపంచాన్ని అర్థంచేసుకుంటున్న తనమీదా,

ఇన్నాళ్లూ మాటా మంతీ లేకుండా సంసారం చేసిన తల్లిమీదా పడింది. ఈ మానని గాయాన్ని ఏవిధంగా మానించాలా అన్న ఆలోచనలు కమ్ముకున్నై. ఆలోచించేడు. ఈ బరువు తను భరించి మోయగలడా? అసలు చచ్చేవాళ్లంతా, వంశపారంపర్యా మొయ్యమని ఓబరువు వదిలిపెట్టి వెళ్లుతారా?

ఆ రోజుల్లో, ఆ ఇంట్లో వుంటే ఆ జరిగిన సంగతులు తిరిగితిరిగి మననకు వస్తాయని ఇల్లు మార్చేడు. తండ్రికి దగ్గరగా, ఒక్కక్షణంఅయినా విడవకుండా, తిండి తిని, కబుర్లు చెప్పడంకంటె ఇంకేమీ చెయ్యలేకపోయేడు. కొంతైనా ఉపశమనం కల్గుతుం దని స్వంతగ్రామం తీసుకువెళ్లేడు. ఆ కొబ్బరి తోటల్లో వరిచేల వాసనల్లో శాంతి, మరపు, మైకం వస్తుందనే ఆశతోనే. కాని 'పరామర్శ' ఎంతో మందిని తెచ్చింది.

జీవితంలో ఆ ముక్క ఎంత క్రూరంగా హింసిస్తుందో అప్పుడు అర్థమైంది. ఉన్న నెల్లాళ్లల్లోనూ ఎవరో ఒకరు వచ్చేవారు. ఏడిపించేవారు. తను అనుకున్న ఆశ, ఈ పిచ్చిచర్యలవల్ల, కళ్లెదుటే ముక్కలుగా చీల్చేయబడడం భరించుకోలేకపోయేడు. అనుకున్న శాంతి, సౌఖ్యం, మరుపుకంటె అశాంతి, దుఃఖం జ్ఞాపకంవచ్చి, తండ్రిని దిగనార్చేయి. ఏముకలపోగే చేసేయి.

తిరిగివచ్చేసేడు అందరితోనూ. అవూళ్లో కాపురం కాదనే, ఇంకోవూళ్లోనే తండ్రి పునః ప్రవేశించేడు. ఈ హడావిడిలో కాలం గడవడం, తండ్రి కాస్తయినా మరిచిపోగలిగే డన్న భావనతోనే రాజా అన్ని పనులూ చేసేడు.

క్రొత్తవూరు! అంతా క్రొత్తే. గతించిన చరిత్రలు జ్ఞాపకంచేసే స్థలాలు లేవు. తండ్రి ఈ క్రొత్త వ్యక్తులమధ్య, ఆయన ఉడిగం అల్లుకోవడం, అది నిజంగా మంచికే వచ్చిం దనుకున్నాడు.

ఆ కొద్దికొద్దిగా మానుతూ పొరకడుతున్న గాయాన్ని చూచి, మాట్లాడని తల్లీ, ఆలోచనల్తో, ఇంకా ఆయనఆరోగ్యం పూర్వపుస్థితికి తేవడం ఎల్లా అన్నదానూ మధ్య ఉండి విజయం పొందడం సంతోషం కల్గించింది.

భగవంతుడు తనను ఈవిధంగానైనా 'కృతజ్ఞత' చూపేందుకే, ఆ ఉద్యోగంలో ప్రవేశపెట్టలేదు అని అనునయం తెచ్చిపెట్టుకున్నాడు. అయినా అది నిలవటంలేదు. తన భావి? రేపు పెళ్లిఅయితే! స్వతంత్రత—ఇవన్నీ జడ్డీల్లా వుండేవి...

ఎదురుచూస్తూ కాలాన్ని గడపాలి. పరిసరాలు తనను ఏవిధంగా కట్టేస్తున్నాయో అని ఆందోళన చెందేడు...

ఒక్కటి, సంసారం ఇప్పుడు పూర్ణంగా తన మీద వుంది. డబ్బా...అది ఈ జీవితంలో తడుముకో అక్కర్లేనట్టే తడుతోంది.

*   *   *

ఆ మాఘంలో కూతురుపెళ్లి ఏడువేలరూపాయిల ఖర్చుతోనూ జరిగి బరువుతగ్గినందుకు చాలా సంతోషపడ్డాడు రామయ్యపంతులు. ఒక్క ఆమూడు ముళ్లుపడినపుడు తన అక్కగారు లేకపోయిందే అని కన్నీళ్లు తిరిగినా, తన కొడుకు తనను కుర్చీలో కూర్చోబెట్టే పెళ్లిచేయించేడు. తనకే ఆశ్చర్యం కలిగించింది. ఈనాడు తను డబ్బుమాత్రం ఇచ్చేడు. తక్కినదంతా వాడే. ఆ సన్నగా వూచలా వున్న కొడుకులో ఇంత క్రమశిక్షణ, మర్యాద నిబిడీకృత మయివున్నందుకు గర్వపడ్డాడు.

తన అక్కగారే ఉంటే, ఆవిడని ప్రతీపనిలోనూ అడగవలసేవుండేది. ఈనాడు రాజా, ఒక్కటీ అడగకుండానే చేసేడు. ఇది ఆశ్చర్యం కలిగిస్తోంది. కొంతవరకూ, తన వియ్యంకుడు వ్రాసిన "పెళ్లిచాలా బాగా చేసేరు" అన్న ఉత్తరం, నీఅక్కగారు చనిపోతూ, నువ్వు నట్టనడిసముద్రంలో నావవు అయిపోతావేమో అని నీకొడుక్కు ఆవిడలో ఉండే జీవచ్ఛక్తులన్నీ ధారవోసింది అన్నట్టు చేసేయి. దానికీ తనకే అర్థంకాని శక్తులు ఉన్నాయేమో అనుకున్నాడు.

ఆ రోజుల్లో ఎవరో వాడిని అడగడం, "పెళ్లికొరకు ఆగిపోయేను. ఎందులోనో ప్రవేశించా లండీ" అన్న సమాధానం తను విన్నాడు. ఇప్పుడు అది నిజంగా ఓ పిరికితనం పోస్తోంది. వాడు వెళ్లిపోతే?

ఇన్ని సంవత్సరాల్లోనూ తన ఆసరామీదనే ఇంత ఉద్యోగం కట్టుకున్నాడు. అది ఒకరి చేతుల్లోంచి ఇంకొకరి భుజాలమీద పడింది తనకి భారం కలగకుండా. ఈ ఇల్లు ఎవరు చూస్తారు? పొలాలమీదికి వెళ్లడానికి, ఇండ్లఅద్దెలు వసూలు చేసుకోవడానికి తనకు తీరుబడి ఎక్కడుంది?

వాడు ఇవ్వాళ, కాకపోయినా ఇంకో రెండు రోజులు గడచిన తర్వాతైనా తన దగ్గరకు ఒచ్చి 'వెళుతా' అంటాడు. ఏమని చెప్పాలి? వాడు వెళిపోతే...శూన్యం. తన కోర్కెలకు, తన సదుపాయాలకు చెంపపెట్టుక్రిందే ఉండిపోతుంది.

ఈ పిల్లల చదువు, తన క్యాంపుల ఉద్యోగం, ఇవన్నీ తను ఒక్కడూ ఎల్లా ఆసరాపడి, నిర్వహించుకోవాలి? ఆలోచన పాలుపోవటం లేదు. తను చేసుకోనేలేడు. చేసుకోడానికి ధైర్యం చాలటం లేదు. అవి మిత్తిలా, క్రూరసర్పాల్లా నుంచుని, జీవితంలో శాంతిని తోలేస్తాయి.

అప్పుడో తనస్థితి...? ఇంతవరకూ జీవితంలో ఇల్లాంటి పరిస్థితి రాలేదు. ఒస్తుం దని ఊహించనూ లేదు...

భయం, ఆవేదన, శూన్యం క్రూరంగా నుంచుని నవ్వుతున్నాయి.

తనభార్యను అడుగుదా మనుకున్నా, ఆవిడ ఆ మూగనోము విడిచి, సమాధానంగా సలహా చెప్పలేదు. చెప్పీయుండనూలేదు. చెప్పగల దన్న ధైర్యం కూడా లే దేమో!

ఈ సమయంలో రాజా తనదగ్గరకు ఒస్తేనే భయంగా ఉంది. ఆ అనుజ్ఞ అడుగుతా డేమో అని. తప్పించుకోవలసినట్టే ఉండేది. తను ఇవ్వలేడు. ఇస్తే...అది పైన ఊహించుకోనివ్వటం లేదు.

తనకు ఇక ఫించనీకాలంకూడా దగ్గరకి వచ్చేసింది. ఇక తన వూళ్లో ప్రవేశించి, ఆ జీవితానికి ఎల్లాగో తను అలవాటుచేసుకోగల నన్న ధైర్యం వుంది. అంతవరకూ రాజా వుండాలి...వుండితీరాలి...

తను ఫించనీ పుచ్చుకున్న తర్వాత, తనకు సహాయం చేస్తా నన్నవాళ్లు చెయ్యరేమో అని బెరుకు లేకపోలేదు. ఈలోపుగా రాజాను ఎందులోనో దూర్చితే, తనవలె కాలగమనంలో పేరుప్రతిష్ఠలు తెచ్చుకుని, తన పేరు నిలబెడతా డన్న తలంపు, ఆశా లేకపోలేదు. అయినా అది నిలవటం లేదు. స్వార్థం అన్నది రాజ్యం చేస్తుంటే, మానవక్రతువులు చెయ్యడానికి గుండెలు వెనుకంజవెయ్యవేమో!

పెళ్లయి రెండు నెలలు గడిచేయి. అన్నిరోజుల్లోనూ, ఆ కబురూ ఈ కబురూ చెప్పి రాజా తన తండ్రికి బడలిక తీర్చేడు. చెల్లెలు అత్తవారినిగురించి, పెళ్లిళ్లల్లో జరిగిన వింతల్ని, ఇల్లాంటివే రాజకీయాలు, ఆఖరుకు ఆఫీసుపనులుకూడా ఆ మాటల్లో దొర్లేవి.

అన్నిరోజుల్లోను తనఎడ చూపించే విముఖత కొంతవరకూ తగ్గడం, తండ్రిబెంగ దిగజారడం తనకు చాలా ఉత్సాహంగానే ఉండేది. ఇది లోపల్లోపల అంతళ్ళకుస్తులు ఆక్రోదించి స్వసంపాదన, స్వతంత్రత మాత్రం పడగలు విప్పేవి. మరి వయస్సు ముదురుతోంది. ఇప్పుడు ఎందులోనో ఓదాన్లో తల దూర్చకపోతే కష్టం అవుతుం దేమో అన్న ఆవేదన లేకపోలేదు. ఈ ఏళ్లతరబడి సాఫీజీవితం తనను ఓ ధని కుడిక్రిందే చేసే, కాలు దించనియ్యకపోవడం అలవాటు చేస్తోంది. చేసిందికూడాను. తనకు తెలియకుండా సంవత్సరాలే గడిచేయి. ఇప్పుడు ఈ సాఫీ, దర్జా జీవితంలో వున్న శరీరం, ఆ వచ్చే వూడిగమునకు తట్టుకుని, వాళ్లకి ఒంగి ఒంగి సలాములు చేస్తూ, ఘంటల తరబడి కాగితాలమధ్య పనిచెయ్యగలనా అన్న నిరుత్సాహం, భయం కల్గకపోలేదు...

ఉద్యోగం చెయ్యకూడదు, ఏపల్లెల్లోకో వెళ్లి, అక్కడ వ్యవసాయం చేద్దామని ఉండేది. తీరా అది బ్రాహ్మణవ్యవసాయమై, సంవత్సరసంవత్సరమునకు అప్పుల్లో పడిపోతా డేమో అన్న భావనా వుంది. పైగా తను చదువుకున్నాడాయె. సమయమొస్తే తట్ట నెత్తి పెట్టాలాయె. దానికి డిగ్రీల హుందాఒప్పుకోదు.

స్నేహితుడు యుద్ధంలో నుండి ఉత్తరం వ్రాసేడు వాడు లెఫ్టినెంట్ కలనల్ అయ్యేడుట. 'నువ్వు ఏం చేస్తున్నావ్?' అడిగేడు. ఆ ప్రశ్న రాజాను చాలా మందే వేసేవారు. ప్రయాణాల్లో, కనపడిన క్రొత్తవాడు అల్లా ప్రశ్నించేవారే. చెయ్యటం లేదు అన్న నిజం, చేసేవాళ్లని చూచి ఈర్ష్య తెప్పించి న్యూనత పరచేది. అందులో అబద్ధాలు ఆడేవాడు. బడిపంతులు దగ్గరనుండి ఇన్సూరెన్సుకంపెనీ ఏజంటు వరకు ఎన్ని చిల్లరఉద్యోగా లున్నాయో అన్నీ చెప్పే వాడు సమయానుకూలంగా.

ఒక్కొక్కసమయంలో ఈ చెప్పడం ఇరుకున పెట్టేది. ఆ వ్యక్తులే మళ్లీ కలుస్తూ ఉండేవారు. ఆ ప్రశ్నే వస్తే, ఏం చెప్పేడో జ్ఞాపకం ఉండేది కాదు.

స్నేహితునికి, ఉత్తరం వ్రాస్తే, రా ఇక్కడ ప్రయత్నిద్దా మన్నాడు. ప్రయత్నం! తను ప్రయత్నించకుండా, చెయ్యకుండా, చెప్పకోవడంలో

ఎన్నో రకరకాలు చేసేడు. అసలు నిజంగా వస్తే తను చెయ్యగలడా అన్న వూహ పిరికితనం కలిగించింది.

భోజనాలదగ్గరే తండ్రితో అన్నాడు: "గణపతి బెంగుళూరులో ఉన్నాడు; ఓసారి రమ్మన్నాడు."

"ఎందుకూ?"

"ఉద్యోగం ఏదైనా ప్రయత్నిస్తాడుట"

"మొన్న సెప్టెంబరుకు కట్టేవు. పరీక్షల సమయానికి జ్వరం వచ్చింది. అది పూర్తిచేస్తే మంచిదేమో !"

"ఇక చదవలేనండి". నిజంగా తన నిరుత్సాహం అల్లా అనిపించింది.

"ఇంకోసంవత్సరంలోపులో నేను పింఛనీ ఎల్లాగా పుచ్చుకోవాలి. పిల్లల చదువుల విషయం బోధపడటం లేదు. మీ అమ్మ నేనూ క్యాంపుల్లో ఇరవై రోజులు వుంటాము. మరి ఇల్లు......ఆవిడ వుంటే..." కంఠం రుద్ధం అయింది రామయ్య పంతులకు.

ఆవిడ! ఇంటికి పెద్దపులి. తండ్రి చెప్పినదానిలో సత్యం లేకపోలేదు. ఆవిడే వుంటే, ఇంట్లో మొగదిక్కు లేకపోయినా గడచిపోయివుండేది. తను ఇంకో వూరు వెళ్లినా, పిల్లలకు ఆదాగానే వుండేది.

ఇప్పుడు నిజంగా ఇల్లు విడచిపెట్టకూడని పరిస్థితే. ఈ చిన్నక్లాసులు చదివేపిల్లలను వంటలక్క మీద వదలడం కష్టమే. తనతల్లి, ఆయనతో లేకపోతే, ఉండివుండని బెంగ, ఆరోగ్యంకూడా దెబ్బతినేస్తయి.

పరిస్థితులను తిట్టుకున్నాడు. అవి తనను మొదటినుండీ విపరీతంగా దెబ్బతీసి దిగనారుస్తూనే వున్నాయి. వాట్లకు జీవితం బలి అయిపోతోంది. దాంతో ఆశలు కూలిపోయి, పిరికితనం నూరేస్తోంది.

మాట్లాడకుండానే వుండిపోయేడు, ఏం సమాధానం ఇవ్వాలో తెలియకుండానే.

తనంత నిర్దయపరిస్థితుల్లో ఇంకో వ్యక్తి లేడేమో అని వెతపడ్డాడు. లోనున్న స్వతంత్రభావాలు అడుగంటుతున్నాయి. అసలు తన జీవితంలో తను సంపాదించలేడేమో !

ఆ ఇంటివద్ద కూర్చుండి, ఉప్పు, మిరపకాయలు ఉన్నాయో లేవో, వంటావిడ నాగాలు పెట్టకుండా ఒస్తోందా ? పాలు, నెయ్యి ఎంత ఖర్చు అవుతోంది? ఇల్లాంటి ఆలోచనలు, కార్యక్రమాలు తప్ప ఇంకొకటి లేనేలేదు. తిండి, నిద్ర, ఇంటిపని, ఇంతే. శరీరం స్తబ్ధత చెందినట్టే ఉంది.

ఆ రోజుల్లో, కాలేజీజీవితాల్లో మొలకలెత్తిన భావనలు ఒచ్చేవి. చుట్టూరా ఉన్న జీవితంలో విషాదాంతం గోచరించేది. తృప్తి లేని దుఃఖాంతజీవితాలు ప్రజలంతా ఎందుకు గడుపుతారో అర్థం కాలేదు. కఫంలో పడ్డ ఈగల్లా కొట్టుకుంటూ, డబ్బుసంపాదనకోసం మానాభిమానాలు ఒదులుకొని ఎందుకు జీవిస్తారోకూడా మృగ్యంగానే వుంది.

కథలు వ్రాసేవాడు. ఆకథల్లోని పాత్రలు, వాతావరణంకూడా ఆనందంలో తృప్తి నిచ్చేవి కావు. ఏదో ప్రపంచకంలో వెతుక్కుంటూ, నిరాశగా, నిట్టూర్పుతో బ్రతికేం అన్నట్టే వుండేవి. బ్రతికినా అమరత్వం రావటం లేదు. దేవుడు అనే కత్తిక్రింద, కైమాచెయ్యపడ్డట్టే వుండేవి. చాలాసారులు అనుకున్నాడు, నవ్వుతూవుంటే చాలాకాలం బ్రతకవచ్చునని.

విషాదాంతం! అసలు జీవితం విషాదకావ్యమేమో! బ్రతుకు అనేది దుఃఖదేవతచీరమడతల్లోని వెలుగునీడలేమో! ఈ భావన ప్రతీపనిని, ఓసమీక్షపు కన్నుతో, దుఃఖంకోసం వెతుక్కునేట్టు చేసింది. అదే జాలినిచ్చేది. జాలితో ఆ వేదన మూర్తీభవించేది.

ఈ చిన్నవయస్సుపిల్లల చదువులు చూస్తుంటే, తన గతించిన చిన్నతనం జ్ఞాపకం వచ్చేది. అది రాజాలాగే జరిగింది. అందులో ఉన్న ఉన్నతి వీళ్ళకి రాలేదు. రాదేమో కూడాను . ఒక్కగా ఒక్కడే తను అప్పుడు. అడుగులకు మడుగులు ఒత్తుతుంటేనే తన చదువు, పోషణ గారాబంలో జరిగింది. ఇప్పుడు వీళ్లో, ఏదో ఆ మైలుదూరం నడచి, వచ్చి, ఇన్ని మెతుకులు కొరికి, నడచివెళ్లుతారు. ఆ చదువుల్లోకూడా పరీక్షపోతుం దన్న దైన్యం ఒళ్లో వున్నట్టే.

జాలి కలిగింది. వాళ్ళకి తన చేతుల్లో ఉన్నదల్లా చేసేడు. చెయ్యాలి అన్నది పూర్ణంగా ఆవృతం చేసినా డబ్బు అన్నది అడ్డంగా నుంచుంది. అది ఈ ఎత్తుదిగుడు విన్యాసాలలోనే తనను ఆడిస్తోంది.

పెళ్ళి అయినప్పటినుండీ సంసారం దాని పస చూస్తూనేవుంది. ఇదివరకురోజుల్లో, ఒచ్చేజీతానికి

తండ్రి శిస్తుల్లో పాలు కలిపి వాడేవాడు. అది ఇప్పుడు సున్నా అయ్యింది. ప్రతీనెలా అప్పుల్లో జీవించడం అవుతోంది.

ఓవిధంలో తనతండ్రి సంసారానికి ఇవ్వకుండా దాచుకుంటున్నాడా అన్న భావన నిలవదు. ఆయన ఏ పాతికో ఏభైయో తప్ప తక్కినదంతా తన చేతిలో పోస్తున్నాడు. ఇది సరిపోవటం లేదు. ఈ స్థితిలో తండ్రిని అడగడానికి కూడా మనస్సు ఒప్పటంలేదు. జాలి కల్గుతోంది. ఆయనమాత్రం ఎక్కడనుండి తెస్తాడు?

ఓవిధంగా తనను న్యూనతపరచింది లేమి అన్న గిజగిజ. తనే సంపాదిస్తూవుంటే. నిజమే వేన్నీళ్లకి చన్నీళ్లు తోడైనట్టు. కాని ఈ వూళ్లో కనీసం ఏభై రూపాయిల జీతం ఎవ రిస్తారు? ఎవర్ని అడగ్గలడు? ఆలోచనలు...వ్యర్థంగా వచ్చి చచ్చేవి.

ఒకటోతారీఖు వచ్చిందంటే, తనకే భయంగా వుండేది. అప్పులాళ్లు...అంతా వచ్చి ముట్టేస్తారనే... ఆ తండ్రిచేతుల్లో పోసిన డబ్బు అంతా ఇచ్చేస్తే తనకు సంసారం నెలా జరిగించడానికి ఒక్కఏగానీ మిగలదు. తను ఇవ్వకతప్పదు. ఇక్కడ పోషించకా తప్పదు...

ఏ స్నేహితులకైనా డబ్బు సర్దుబాటుచేస్తారేమో అని వ్రాయాలనుకున్నాడు. రైతులకి వ్రాద్దామన్నా, వాళ్ల పెళ్లాల మెళ్ళో పుస్తెలు తాకట్టు పెట్టించి డబ్బు దమ్మిడీలతో వసూలుచేసేడాయె. స్నేహితులుమాత్రం...ఈ యుద్ధపురోజుల్లో...పాలుపోలేదు...ఎకౌంటు పుస్తకం తీసినప్పుడల్లా క్రూరంగా మూడంకెల బాకీలు కన్పడేవి. వాళ్లు ఎక్కడ నిలబెట్టి డబ్బు ఇమ్మంటారో అనే భయం. పైగా న్యూనత...ఇల్లు కదలనివ్వటం లేదు. పిరికితనం..

ఎల్లాగా తీర్చేది? తనకి అప్పు ఎవ రిస్తారు? ఈ నిరాశే...వంశపారంపర్యా వచ్చే పెట్టెలు తీయించింది. వెతికేడు. తన గౌరవం, సంసారపుగుట్టు నిలబడాలి, అవమానం రాకూడదు అన్న తలంపే... వంశంగా వచ్చేదాంట్లోనే బంగారంతీసేడు; దొంగతనంగానే ఆ సాయంత్రం హుషారుగానే వెళ్లి అమ్మి, దారిలో అప్పుల్లో సగంపైగా తీర్చి, ఉన్న డబ్బు నెలాఖరువరకూ సరిపోతుం దని సంతోషపడ్డాడు.

క్రియ అంతా జరిగినతర్వాతనే మైకం వదలింది. తను ఎంత క్రూరమైన తలవంపు కలిగే పని చేసేడో అర్థంఅయ్యింది. తన తండ్రి గడించే అది మూలపురుషుల్లాగే దాచిపెట్టేడు. దాన్ని ముట్టుకోకూడదు అన్న పవిత్రతతోనే...

తనో...ఎన్నో విపరీతసన్నివేశాలు క్రుంగతీసేయి. తను ఎంత నీచంగా తయారయ్యేడో, తన తండ్రిఇంట్లో తనే దొంగ...

ఏడ్చేడు. హృదయం పగిలేపోయింది.

ఒక్కటి......

ఈ సంగతే తెలుస్తే, తన తండ్రి నీచంగా ఎంచి, 'వెళ్లిపొమ్మంటాడు' అనుకున్నాడు. వెళ్లిపోతాడు......ఎక్కడికో...ఆఖరుకు కూలి నెత్తుకునైనా...జీవించవచ్చు నన్న ఆశ మిణుకుమిణుకుగా తట్టింది. కలా? ఆశ...తన ఆశ, ఈ చావలేని ఆశ మేడలు కట్టిస్తోంది.

* * *

పింఛనీ పుచ్చుకుని స్వగ్రామం చేరుకున్నాడు రామయ్యపంతులు. ముఫ్ఫైసంవత్సరాలు పైగా ప్రభుత్వాన్ని కొలిచే మేడలు ఎక్కేడు. ఇప్పుడు ఆ పరివారం, ఆశ్రితులు, బిళ్ల బంట్రోతులు అన్నీకూడా వెళ్లిపోయేయి. తన జీవితం ఆఖరైపోయింది. ఒకళ్లని పాలించడం, ఆర్డర్లు వెయ్యడం, జిల్లా అంతా తిరగడం అంతంఅయింది.

ఆఖరురోజున, ఆ ఛార్జీ ఇచ్చేటప్పుడు, చేసిన సేవ, అనుభవించిన పవరు అంతా ఆఖరు అన్న భావన గుబగుబ మనిపించింది. దుఃఖం వచ్చింది. అయినా ఒకళ్లకి తెలియకనే అది లోపల్లోపలే చెలరేగి, దుమారాలు లేపి, శాంతపడింది.

అంత శాంతంలోనూ వున్న రామయ్యపంతులు భార్య ఆరాటనపడిపోయి, ఇక వుండడం ఎల్లాగా అని మెడలో నగలు భర్త అమ్మడానికి తీసుకువెళ్లినపుడు బాధపడే భార్యలాగే వలవల్లాడింది.

ఈ రెండు ప్రవృత్తులూ చూస్తే రాజాకి అర్థంకాలేదు. తన తండ్రికి ఉద్యోగంమీద, తల్లికి ఆఫీసరుగారి భార్యగా చెలామణిమీద ఉన్న వ్యామోహం ఎందుకో అని. అంతగా వ్యామోహం ఒదల్లేనితనం వున్న తండ్రి తనని ఎందుకు ఉద్యోగాల్లోకి పోనియ్యడో? అలోచించినా దానికి కారణాలు కన్పించటం లేదు.

ఆ పల్లెగ్రామం చేరినతర్వాతనే ఓసారి సింహావలోకనం చేసుకున్నాడు. ఇన్నివత్సరాల ఊడిగం, తను పింఛినీ పుచ్చుకుని ఇంటికి వచ్చేసరికి, అప్పుమాత్రం ఇచ్చి కూర్చోబెట్టేయి. అంతే! తను

ఇన్నాళ్లు, తన పాలాలమీద వచ్చే శిస్తుల్ని పెట్టి, కడుపు మాడ్చుకోకుండానే, గౌరవం నిలబెట్టుకున్నాడు. ఆ గౌరవంలో బానిసత్వానికి, అందులో నిజాయితీకి ప్రభుత్వం శరీరాల్ని పీల్చేయడం, నాలుగు వేలుపైగా అప్పులు పెట్టించడం బహుమతీగా ఇచ్చేయి.

నవ్వు వచ్చింది. చేసినన్నాళ్లుకూడా తను లెఖ్ఖలు వేసుకోలేదు. ఈ తీరుబడి కాలంలో తను జమ, ఖర్చులు చూచుకుంటే తేలిన ఫర్మానా అది. ఆ శ్రీముఖానికే తను అమ్ముడుపోయేడు.

అసలు, ఈ ఉద్యోగనర్మాల పర్యవసానం ఇల్లా వుంటే కొడుకును ఉద్యోగంచెయ్యమనడం అంత తెలివితక్కువ ఏమీ లే దన్నట్టు తట్టింది. అయినా...తను పేరు సంపాదించుకున్నాడు...ఇది మాత్రం చిరస్థాయిగానే నిలబడిపోయింది. మరి కొడుకో...

ఆ తీరుబడిరోజుల్లో, ఇంటికి వచ్చే పత్రికలు తిరగవేసేవాడు. అందులో కొడుకు వ్రాసిన కథలు జ్ఞాపకంగా కనపడితే చదివేవాడు. ఓవిధమైన 'నిరాశ' బరువుగా నల్చుని ఉండడం ఆలోచనలు కలుగజేసేది. అయినా అది తననుమార్చలేదు. ఆకొడుకు దృక్పథంలోనైనా చూడా లన్న తలంపు కల్గించలేదు. తను వూహించి బాధపడడానికి తీరుబడి లేనేలేదు.

తీరుబడి. నిజంగా తీరుబడి లేదు. రైతులు వచ్చేవారు. వెళ్లేవారు. రమ్మనేవారు. తను వెళ్లేవాడు. అదంతా ఏదో కలగాపులగంగా ఉన్నట్టే వుంది. ఈ చేతిలో డబ్బులేకపోవడం అన్నది, కొడుకు కళ్లుమూసుకునే పొలాలికి కవుళ్లు, ఆపాతవుక్తాలతోనే ఇచ్చేడు. ఇళ్లఅద్దె పెంచలేదు. రావలసిన బాకీలకు నోటీసైనా ఇప్పించేడు కాదు; అన్న కోపం కల్గించేది.

నిజంగా డబ్బు లేనేలేదు. తనకు ప్రభుత్వం దగ్గరనుండి పింఛనీ రావడానికి చాలాకాలం పడుతుంది. అన్నాళ్లు తను, తన కుటుంబం మాడుతూ కూర్చోవాలా?

రోజూ, ఏదో ఖర్చులకు తెమ్మని, ఇంట్లో కొడుకు అడుగుతూనే వున్నాడు. వాడు అడక్క ఏం చేస్తాడు? వచ్చినప్పటినుండి, తను ఇంటి ఎక్కౌంటు తీసుకునే సర్దుతున్నాడు. ఆ గిజగిజలాడే సమయంలో, వెనక పేజీలు త్రిప్పితే తన కొడుకు ఎంత దూబరాగా సంసారాన్ని అప్పుల్లో పడవేసేడో కనపడి చికాకు కల్గించేది.

నిజంగా తనే డబ్బు వాడివుంటే ఈ విషమ పరిస్థితి రాలేకపోయేది. రాకపోయివుండేది కూడాను. పదిసంవత్సరాలు, పైలా పచ్చీసులా తను ఆర్జించిన, తన పొలాలమీద సంపాదించిన డబ్బు వాడేయడమే కాకుండా అప్పుల్లోకి ఈడ్చాడు. ఏవిధంగా అవి తీర్చాలో తెలియక, కోపం, అసహ్యం కల్గించేయి కొడుకుమీద.

రోజూ ఇలా స్తబ్ధులా ఉండి, తిండి మాత్రం తింటూ, నీటుగా బట్టలు వేసుకుని, రంగేళీలా ఉండి, తనను డబ్బు అడగడం ఒళ్లు మండిస్తోంది. డబ్బు ఎక్కడనుండి తేవడం...?

ఈ వెధవ పుట్టినప్పటినుండి డబ్బుఖర్చే అనుకుని తిట్టుకున్నాడు. వాడు ఉద్యోగంలోప్రవేశించి సంపాదించకూడదూ? ఇంకా ఎన్నాళ్లు ఇల్లా వుంటాడు?

ఆరోజు అనుకోకుండానే రామయ్యపంతులు తన పాతపెట్టెలన్నీ తీసేడు. కాగితాలన్నీ తిరగవేసుకున్నాడు. అచేతనంగానే తన మూలపెట్టె తీసుకుని, సరిచూసుకునేసరికి గుండెలు ఆగిపోయేయి. తను ప్రాణపదంగా భావికొరకు దాచుకున్న మూలవిరాట్టుల్లో కొంత పోయింది. పోయింది అని అనుకోడానికి అయినా గుండెలు నిలవలేదు.

ఎవరు తీసేరు? గత ఎనిమిదివత్సరాల్లోనూ ఎవరికీ నగలు చేయించనే లేదు. తను అవి వున్నాయేమో అన్న తలంపు, చూచుకోవా లన్న అభిలాష కల్గించలేదు. తనకు అవి వుండవన్న అధైర్యమూ కల్గలేదు. ఇప్పుడో! తన భార్య తీస్తుం దని తనకి నమ్మకం లేదు. ఇం కెవరు?

నెమ్మదిగా పిల్చి "నువ్వు ఏమైనా తీసేవా?" అన్నాడు.

"తెలియదు" అంది.

"మరి ఏ మవుతుంది?"

ఆమెకూడా పెట్టెలన్నీ వెతికింది. అ దేమైనా ఇంకోదాంట్లో పడిం దేమో. లేదు. పోయింది. దుఃఖం కలిగింది.

"వాణ్ణి అడుగు..."

అప్పుడే వచ్చినవాణ్ణి నెమ్మదిగా వస్తూనే అడిగింది. అసలు కొడుకుతో మాట్లాడ్డమే భయం. ఈ భయం నరనరాలకీ అలవాటు అయినట్టే.

క్రుంగిపోయేడు. తను నిజంగా చేసిన తప్పు, ద్రోహం, ఎంతక్రూరమైనదో అని పడగలు విప్పుతుంది.

మాట్లాడనేలేదు.

"ఆయన మధ్యాహ్నంనుంచి వెతుకుతున్నారు. నువ్వుకూడా ఓసారి చూద్దూ?" అంతకంటె ఆమె తనకొడుకును చెలాయించి అడగలేదు. ఆ ప్రాధేయతకు తనకు దుఃఖం కలిగింది.

వెతికేడు. ఈ గుండెల్లో కుంపటిలా ఉండే తిరగవేసేడు. చెప్పాలని ఉంది. మార్గం ఎల్లాగో అర్థం కావటం లేదు. శరీరం పనిచేసింది కాని, అంతస్సు బాధతో క్రుంగింది.

వాళ్ళిద్దరూకూడా, నిలబెట్టి అడగగలిగినా అడుగలేదు. అడగరు. ఆ గౌరవం తనమీద ఉంచేరు. కాని తన జన్మలో ఆ గౌరవం నిలబెట్టుకోవడానికి హక్కు లేకుండానే చేసేడు. ఈ నైతికపతనానికి తన పరిస్థితులు తీసుకువెళ్ళినా, అది కుటుంబగౌరవంకోరకు తను వెచ్చించినా, తన నిజాయితీ, తన బాధ వాళ్లు గుర్తించలేరు. గుర్తించరుకూడాను.

"రెండుమూడువందలిది. ఇంట్లోకి ఎవరు వస్తారు? ఎల్లా పోయింది? దొంగలు వచ్చేరా?"

"ఇంత భద్రంలేనివాళ్లే కనుక ఒక్క నగా చెయ్యించ నన్నా. ఇచ్చేయి నీమెళ్లో వున్నవన్నీ. ఏ బ్యాంకులోనైనా తగలెడుతా"

"కష్టార్జితం...ఒకటా రెండా...ఆక్షణంనుండి నాకు మనస్సు విరిగిపోయింది. ఒక్కక్షణం శాంతి లేకుండానే ఆలోచనలు..."

"ఈ సంసారం చూస్తుంటే నాకే విరక్తి కలుగుతోంది. ఈ క్షణం విడిచిపెట్టి ఏ కాశీఅయినా లేచిపోవాలనిపిస్తోంది".

ఆయన అంటున్న ముక్కలు వినిపిస్తున్నై. చెవుల్లో సూదులు...ఎంత వ్యర్థంగా తను పతనమయ్యేడో! ఏ ప్రపంచకపు అంచులకు వెళ్లి తను ఏడ్చి, క్షమార్పణలు కోరి అడిగితే, తను చేసిన గాయం మానుతుందో? ఒక్కరోజుకి తను క్షమింపబడుతాడా?

చెప్పడం...యవ్వనంలోని రక్తం తిరగబడమంటుంది. ఈ ఆత్మ, ఘాతికాలవిప్లవంలో తను కీటకం అయ్యేడు. సత్యం అన్నది నచ్చచెపితే... వినేవారెవరూ?

రెండు ... మూడు...రోజులు గడిచేయి. ఇంట్లో తన తల్లి, తండ్రీ బెంగ, దుఃఖం తోటే తిరిగేరు. తను అన్నం తినలేకపోతున్నాడు. క్షోభ... ఆవేదన...

ఆ సాయంత్రమే ఇక ఉండలేకనే "నే తీసేను" అన్నాడు తల్లితో.

"ఏం చేసేవు?"

"అవేం అడగవద్దు. కొద్దిరోజుల్లో నేనే ఇచ్చేస్తా".

శాంతి వచ్చినట్టే ఆయనతో చెప్పింది.

"హృదయం విరిగేపోయింది. ఇవన్నీ చూస్తూంటే, సంసారం ఏ గోతుల్లో పడనీ...నాకాలం నాకు వెళ్లింది. ఇంక వెళ్లదని బెంగ లేదు..."

ఈ శూన్యంలో, ఆవేదనలో అది విన్నాడు. హృదయం మండింది. తన తండ్రి తనకి గాఢ్ఠిగా తగలాలనే అన్నాడు. కాని, ఈ ఇంట్లో కూర్చుని, తను ఆయనతిండి తింటూ, గుడ్డ కట్టుకుంటూ, దానికోసం శరీరంలో రక్తమాంసాలు ఏళ్లతరబడి నైవేద్యం పెట్టి, ప్రతిష్ఠకోరకు పతనం చెందేడు...

సంపాదన లేకపోవడం తనను నీచంగా, జలగలాగే చేసింది. ఇప్పుడు ప్రపంచకంలోకి తను వెళ్లాలన్నా వెళ్లలేడు.

ఏం చెయ్యాలి?

*          *          *          *

రోజులు బరువుగా గడుస్తున్నై. అన్ని ఘంటలూ జరుగుతాయా, తను పొందే ఈ ఝుంఝూమారుతపు ఝంఝా తగ్గుతుందా అని ఆశించేడు.

ఒక్కటి. ఆనాటినుండి, తను పుట్టి, పెరిగి, జ్ఞానం, విద్య ఆ గడపల్లో, ఆ మాటల చైతన్యంలో పొంది, చీనూ రక్తం పంచుకున్నా, ఇప్పుడు తను ఎక్కడినుండో వచ్చిన కృతఘ్నుడి జీవితం వెళ్లపోసుకుంటున్నట్టే ఉంది. తనకి మొదటినుండి హృదయమిచ్చి మాట్లాడేవారు లేరు. ఇప్పుడో అసలు పలకరించి, ఉన్నావా అని అడిగేస్థితికూడా పోయింది.

తన తండ్రో? ఆయన్ని చూడ్డానికే భయపడుతున్నాడు. ఎదటబడి ఏదైనా చెప్పడానికికూడా గుండెలు నిలవటం లేదు. ఈ స్థితి దిగనార్చినట్టే వుంది. తన నరాల్ని వెనక్కు తోడినట్టే.

ఎక్కడికైనా, ఏ అరణ్యాల్లోకో, అనంతాల చివరకో వెళ్లిపోవాలి. శాంతంగా, అక్కడ ఉండిపోవాలి...ఈ వాతావరణంలో అశాంతి ఉండలేకపోయింది.

ఎదటపడకుండానే "ఎక్కడికైనా వెళ్లాలి" అన్నాడు.

ఏమిటీ ? అన్నట్టుగా చూచి, "ఎందుకూ ?"

"ఏదైనా ఉద్యోగం ప్రయత్నించి అది చెయ్యాలని ఉంది"

"నే నేం వెళ్లవద్దన్నానా ? వెళ్లు" గునపం గ్రుచ్చినట్టే అయింది. అందులో ఈసడింపు. రక్తం చచ్చింది...

"రేపే వెళుతున్నా..."

"వెళ్లూ...ఈ క్షణంలోనే. ఈ సంపాదన, ఈ ఆర్జన ఇదంతా నాకోసమా ఏమిటి ? వార్ధక్యంలో ఉన్న నా ఆరోగ్యం మీరంతా సరిచూస్తూఉండా లని నేను ఆశిస్తా. ఉంటే పదికాలాలపాటు పింఛినీ డబ్బులు వస్తాయి."

"ఈ ఆస్తి నాకేం అక్కరలేదు; నేనే సంపాదించుకుంటా..."

"సంపాదించేవుకా ! నాకుమాత్రం కావాలా ఈ సంసారం. నారోజులు ఎల్లాగా వెళుతాయి...నన్ను ఉద్ధరించినట్టు మాట్లాడుతావేం..."

"నన్ను ఉద్ధరించుకోడానికే...నా బ్రతుకు నే బ్రతకక్కర్లేదూ ? నాకు మీ ఆస్తిలో ఒక్క సెంటు భూమికూడా అక్కర్లేదని వ్రాసిస్తా కావలిస్తే...నే వెళ్లాలి..."

తల్లి గాబరాపడింది ఇద్దరిమాటలూ చూచి. కాని ఏం చెయ్యాలో తెలియలేదు.

"ఊరుకోరా!"

ఊరుకునేఉన్నాడు. ఇన్నాళ్లూ. ముప్ఫైవత్సరాలుపైగా. అణిగిమణిగే. దానికే ప్రతిఫలం...

చెయ్యి పట్టుకునే గదిలోకి తీసుకు వెళ్లింది...

"వట్టి గొడ్డుకు పుట్టెడు ఆర్పులట" ఆయన... తలుపుసందుల్లోంచే వినపడ్డాయి. అదే అయింది తన జీవితం...

దుఃఖం వచ్చింది. ఎదలోని రొదలు విజృంభించేయి. తన జీవితం ఆ క్షణంవరకూ సింహావలోకనం చేసుకోమని కూర్చుంది. ఎదురుగా ఒక్కొక్క వత్సరమే, ఎంత వృథాగా, నిర్దయగా, క్రతువుచేయబడిందో తిరిగింది. ముప్ఫై నిండు వత్సరాలు...

ఏమీ చెయ్యకుండానే. తను బ్రతికినా, చచ్చినట్టే. కృతజ్ఞత నెత్తిమీద కూర్చుని చెలాయించింది. అదే శరీరంలోని జవసత్తువల్నీ, ఆశల్నీ, ఆడంబరాల్నీ తినేసింది. వాటిని తన దగ్గరనుండి ఏ మార్గంలో విడకొట్టి, పూర్ణశానిస క్రింద చేసుకోవాలో చేసి, ఇప్పుడు నవ్వుతూ కూర్చుంది.

ఈ క్షణంలో, ఇంత రాత్రివేళ ఎక్కడికైనా వెళ్లిపోవా లన్న కోర్కె : ఉండలేని పరిస్థితులను మూటకట్టింది. వెళ్లిపోవాలి... తెల్లారితే తను ఆ కళ్లల్లో పడి తిరగలేడు.

బ్రతుకే చచ్చినతర్వాత ఈ కట్టె ఎందుకో అన్నట్టే...ఎక్కడికి వెళతాడు. ఉద్యోగం...ఎవరిస్తారు ?...మరి డబ్బో !

పర్సు తీసుకున్నాడు. అదీ నీరసంగా ఏడుస్తున్నట్టే, ఏడణాలన్నరని దాచుకుని చూస్తోంది... తను నడిచినా, ఆఖరుకు రెండుజతల దుస్తులతో వెళ్లినా, ఎంతదూరం నడవగలడు ? దారిలో తిండి ! అంతవరకూ జీవితంలో ఒకళ్లని దేహి అనకుండానే గడపడం నరాలకు పట్టింది. ఇప్పుడు ఒకళ్లదగ్గరకు వెళ్లి..."భోజనం పెడతారా ?"

ఆత్మ చచ్చిపోతుంది. ఇంతకంటె మలమలా మాడి...ఆపైది తలపుల్లో భీకరంగా వుంది...

ముడతలుపడుతూన్న శరీరం నవ్వుతోంది వయస్సును దాచుకుని. ఈ వయస్సులో తను వూడిగం చేస్తా నని అడిగినా ప్రభుత్వం తీసుకోదు. పైగా ఆ పరీక్షలు కట్టేందుకు ఎక్కడ డబ్బు తేవడం ?

ఉద్యోగం ఇచ్చినా, తను చెయ్యలేడేమో ! ఉదయంమొదలు సాయంత్రంవరకూ సలాములు చేస్తూ, వాళ్లు తిడుతుంటే, త్రిప్పుతుంటే తన అంతస్సు ఒప్పుకోదు. ఒప్పుకోవటం లేదు. అసలు చెయ్యగలడా, సందిగ్ధం...చెయలేను...చెయ్యలేను అని అరుస్తోంది.

ఏం చెయ్యాలి ? ప్రపంచకం శూన్యం, చీకటిని భార్యల్లా చేసుకుని ఎదురుగా నుంచున్నట్టే వుంది. జీవచ్ఛవపరిస్థితులు దిగనార్చి కాలుస్తుంటే, అది మాత్రం జాలిపడుతుం దనుకోవడం వెర్రితనం...

మరి జీవించి...అసలు ఎందుకు ? తనమీద ఆశలు కట్టుకున్నవారు, తను ఆశించుకున్న ఉన్నతులు, మరణించేయి. ఏమీ చెయ్యలేని, ఆత్మక్షోభ...వ్యర్థం అంటోంది.

చచ్చిపో ! ఆత్మలోకాల్లోంచి పౌరుషం అభిమానంలో ఎలుగెత్తింది.

మృత్యువు ! అందులో శాంతి, సుఖం ఈ నిరంతఘోష అణగుతుం దని ఇదివరకు చాలాసార్లు

అనుకున్నాడు. కాని అది పూర్ణాకృతి దాల్చలేక పోయి అప్పుడు లోపల్లోపలే నాట్యం చేసింది... ఇప్పుడో...

పువ్వులు విచ్చుకుని, పూర్ణ రంగులతో ఆహ్వానిస్తున్నట్లే వుంది. ఆవిడ తనను కౌగలించుకోడానికే నవ్వుతోంది.

తను చచ్చిపోవాలి...

తనకోసం దుఃఖించేవాళ్లు లేనేలేరు. తల్లీ, తండ్రీకూడా కన్నందుకు ఋణం తీర్పించుకునే ఇప్పుడు ఒదిలివేసేరు...బ్రతుకా...అది లేనే లేదు. ఈ గాఢాంధకారపు లోకంలో వెలుగు లేదు. లేనప్పుడు ఉండడం...ఊపిరితీస్తూ బ్రతకడం...?

వెనక్కు చూచుకున్నాడు. గదిమూలలలో చీకటి నవ్వింది. తనను చూస్తూ ప్రతీవస్తువూ నిలదీసి, వ్యర్థజీవీ! తండ్రిమీద పడి తిన్న జలగా! నీఇంట్లో కన్నం వేసిన దొంగా! అంటున్నాయి...ఉడికిపోయేడు. కౌగితం తీసేడు. తను నిజంగా చేసిన పనులకి నిర్దోషే! అయినా శిక్ష పొందుతున్నాడు. తండ్రే తనను ఈ కూపంలోకి లాగేసేడు. అది సాలిగూడే అయిపోయింది.

"నాన్నా! రేపు నువ్వు ఈ ఉత్తరం చూచే టప్పటికి నేను అనే జీవి ఉండదు. బహుశః రక్తగడ్డ కట్టి, బాధతో నల్లగా, ముడతల్లో పడిన కట్టెమాత్రం ఉరిలో కనపడుతుంది. ఆ సాయంత్రంతో అదీ కనపడదు.

ఈ వయస్సులో మీకు తీరని ద్రోహం చేసి వుండవచ్చు. వంశానికే మచ్చ తెచ్చివుంటుంది నా చర్య. అయినా అంతకంటె నాకు గత్యంతరం లేనేలేదు.

నువ్వు పెంచేవు ఓ ధనికుడి బిడ్డలాగే. డబ్బు అనేది వెదజల్లే నాలో నిషా ఏర్పరచేవు. దానికోసం నన్ను నీ బానిసక్రింద చేసేవు. కృతజ్ఞత అన్న దానం క్రింద నేను నీకు శరీరం ఒప్పచెప్పేను. ఆత్మ తిరగబడినా...

నన్ను నైతికపతనం చేసింది. నా నరాలను అది తోడేసింది.

ఈ జీవికి ఓచోట ముక్తి ఉండని స్థితి అలుముకుంది. ఏమూలా నాకు స్థలం లేదు. ఇదీ ప్రతిఫలం.

నాలో ఉన్న అభిమానం, మగజీవిగా పుట్టిన పౌరుషం, ఆత్మాభిరుచికూడా ఇప్పుడు తిరగబడే నన్ను ఈ స్థితిలోకి తీసుకువచ్చింది.

వెళతా! ఆ లోకంలో ఏదో వుందనే. దాన్ని పొందనీ, పొందలేకపోనీ, కొన్నాళ్లు చచ్చి జీవించేను అన్న భావన, నన్ను ఏ అనామకుడిక్రిందో, ఏ ముష్టివాడిక్రిందో ఎందుకు పుట్టిపెరగలేదా అన్న ఆశ మాత్రం ఉంది. అది నాకు రాదు...ఇక వస్తుం దేమో అనుకోవడం మూర్ఖత్వంకూడా.

ఈ ఆఖరిక్షణంలోకూడా ఒక్కటే బాధిస్తూ వుంది. నీ డబ్బు నేను తీర్చకుండానే చచ్చిపోతున్నా. అది తీర్చలేని అప్పుక్రిందే ఉంటే...

క్షమించు.

అమ్మా,నువ్వూకూడా విచారించకండి. విచారం, మననం అన్నది మీకు దుఃఖం కల్గిస్తుంది. వయస్సు ముదిరిస్తుంది.

పుట్టలేదనే అనుకోండి...

జీవితంలో యాత్ర అయిపోయింది. అది నేను అనుకున్న పువ్వులూ, కాయలూ లేని వృక్షమైంది. ఇది నా పాపఫలితమే కావచ్చు. కర్మ అనేదే దుఃఖం గీతగీసివుండవచ్చు.

ఒక్కటి కోరుతున్నా...

నాతర్వాతవాళ్లకి మాత్రం నాలాంటి పెంపకం ఇవ్వకూ...ఇస్తే వాళ్లూ బాధ ఓర్చుకోలేకపోతారేమో! వాళ్లను బీదవాళ్లక్రిందే పెంచు...

క్షమించ నర్హత లేకపోయినా, ఈ అంత్యకోర్కగా అదే అడుగుతున్నా..."

... ... ... ...

ఇక వ్రాయలేకపోయాడు...

అంతే...

శూన్యంగా ఉన్న చీకట్లు తగ్గిన దీపంలో నాలికలు చాపేయి...

ఎర్రటి ఛాయలు వెనక నున్న కేకారాల్ని ఆహ్వానించేయి...

అంతం...బాధ...ఓర్పు...ఆ లోకం...చీకటి ...అంతా చీకటి...

జీవితయాత్ర అయిపోయింది.

---